# పొదిలిలో ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు



**పొదిలి, పెన్ పవర్ , జూన్ 8**

పొదిలిలో ఎరువుల దుకాణాలపై విజిలెన్స్ దాడులు జరిగాయి. సోమవారం నాడు పట్టణంలోని పలు ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా షాపుల్లోని రిజిస్టర్లను పరిశీలించారు. అలాగే ఎరువులు పురుగుమందులను ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, అలా కాకుంటే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని విజిలెన్స్ అధికారులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విజిలెన్స్ అధికారులతో పాటు మండల వ్యవసాయాధికారి డి శ్రీనివాసులు రెడ్డి, వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


పెన్ పవర్
MARKAPURAM మార్కాపురం
మార్కాపురం - ప్రకాశం

# నమ్మకం... నిబద్ధత... నాయకత్వం

## డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ రాజకీయ ప్రస్థానం

### ఎమ్మెల్సీ శ్రీకాంత్ గెలుపు రాష్ట్ర టిడిపికి బూస్ట్

### శ్రీకాంత్ గెలుపుతో కందుకూరుకు రాష్ట్రస్థాయిలో గుర్తింపు





**కందుకూరు పెన్ పవర్, జూన్ 8**

రాజకీయాల్లో పదవులు వస్తుంటాయి... పోతుంటాయి. కానీ నమ్మకం, నిబద్ధత, విలువలు, నాయకత్వంపై అచంచల విశ్వాసం కలిగిన వ్యక్తులు మాత్రం అరుదుగా కనిపిస్తారు. అలాంటి అరుదైన నాయకుల్లో తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ చౌదరి ఒకరు. విద్యార్థి నాయకుడిగా ప్రారంభమైన ఆయన ప్రస్థానం, నేడు రాష్ట్ర స్థాయి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే స్థాయికి చేరుకోవడం వెనుక ఎన్నో పోరాటాలు, త్యాగాలు, విజయాలు ఉన్నాయి. తెలుగుదేశం పార్టీ విద్యార్థి విభాగం టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఉన్న రోజుల్లోనే ఆయన తన నాయకత్వ లక్షణాలను చాటుకున్నారు. అప్పట్లో ఆ పదవికే పరిమితమై ఉండి ఉంటే, ప్రజల మధ్యకు వెళ్లి జడ్పీటీసీగా పోటీ చేసే అవకాశం దక్కేదా అనే ప్రశ్నకు సమాధానం ఆయన రాజకీయ ప్రయాణమే.

జడ్పీటీసీగా ఎన్నికై ప్రజా సమస్యల పరిష్కారంలో చూపిన చొరవతో పలుమార్లు "బెస్ట్ జడ్పీటీసీ" అవార్డులను అందుకోవడం ఆయన సేవా తత్వానికి నిదర్శనం. పదవిని హోదాగా కాకుండా ప్రజలకు సేవ చేసే అవకాశంగా భావించడం వల్లే ఆ గుర్తింపు లభించింది. ఆ తర్వాత తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఆయన చేసిన పోరాటం రాజకీయ వర్గాలను ఆశ్చర్యపరిచింది. అత్యంత ప్రతిష్టాత్మకంగా జరిగిన ఆ ఎన్నికల్లో విజయం సాధించి, ఆ గెలుపును తన రాజకీయ గురువు, పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కు కానుకగా అందించారు. ఇది కేవలం ఎన్నికల విజయం మాత్రమే కాదు, నాయకత్వంపై ఆయనకున్న విశ్వాసానికి నిదర్శనం. ఎమ్మెల్సీ గెలుపునుండే రాష్ట్ర రాజకీయాల్లో టిడిపి ఊపు అందుకుంది. ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ గెలుపుతో కందుకూరు పేరు రాష్ట్రస్థాయిలో మారుమోగింది. అనంతరం పార్టీ అత్యంత కీలకమైన కుప్పం బాధ్యతలను ఆయన భుజాన వేసుకున్నారు. దాదాపు మూడున్నర సంవత్సరాలుగా కుప్పంను సొంత కుటుంబంగా భావిస్తూ, కార్యకర్తలను తన కుటుంబ సభ్యుల్లా చూసుకుంటూ ముందుకు సాగారు. పార్టీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో తనదైన ముద్ర వేశారు.డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ రాజకీయ ప్రయాణంలో ప్రతి బాధ్యత ఒక కొత్త అవకాశంగా మారింది. ప్రతి అవకాశం మరో పెద్ద లక్ష్యానికి దారి చూపింది. పదవుల కోసం కాకుండా బాధ్యతల కోసం పనిచేసే నాయకుడిగా ఆయన గుర్తింపు పొందారు. అందుకే ఇప్పుడు రాష్ట్ర స్థాయిలో మరింత కీలకమైన బాధ్యతల వైపు అడుగులు వేయాలని పార్టీ అధినేత నుంచి వచ్చిన పిలుపు ఆయన రాజకీయ జీవితంలో మరో మైలురాయిగా నిలవబోతోంది.ముగిసింది ఒక అధ్యాయం మాత్రమే. కానీ కొత్త అధ్యాయానికి నాంది పలికే సమయం ఆసన్నమైంది. ప్రజల విశ్వాసం, కార్యకర్తల అభిమానంతో పాటు పార్టీ నాయకత్వం ఆశీస్సులు తోడైతే డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ భవిష్యత్‌లో మరింత ఉన్నత స్థానాలను అధిరోహిస్తారనే నమ్మకం రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతోంది.నమ్మకాన్ని నిలబెట్టుకున్న నాయకుడు... విలువలకు కట్టుబడిన వ్యక్తి... బాధ్యతలను అవకాశాలుగా మలుచుకున్న రాజకీయవేత్త అదే డాక్టర్ కంచర్ల శ్రీకాంత్. అటు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కు యువ నాయకుడు నారా లోకేష్ బాబు కు నమ్మకమైన వ్యక్తిగా గుర్తింపు పొందిన డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ను రాష్ట్రస్థాయిలో తన సేవలను ఏ విధంగా ఉపయోగించుకుంటారో వేచి చూడాలి మరి.

# ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి యోగా దోహదం

## ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు





**కందుకూరు పెన్ పవర్ జూన్ 8**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న యోగాంధ్ర-2026 కార్యక్రమంలో భాగంగా సోమవారం ఉదయం కందుకూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం ప్రాంగణంలో యోగా కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ, మున్సిపల్ కమిషనర్ అనూష, పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు దామా మల్లేశ్వరరావు, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. యోగ శిక్షకుల ఆధ్వర్యంలో నిర్వహించిన యోగా సెషన్‌లో పాల్గొన్న వారందరూ వివిధ యోగాసనాలు, ప్రాణాయామాలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ యోగా అనేది భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన జీవన విధానమని అన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి యోగా ఎంతో ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ రోజువారీ జీవితంలో యోగాను భాగం చేసుకోవాలని సూచించారు.సబ్ కలెక్టర్ దామెర హిమవంశీ మాట్లాడుతూ యోగా ద్వారా ఒత్తిడిని తగ్గించుకోవడంతో పాటు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవచ్చని తెలిపారు. ప్రజల్లో యోగాపై మరింత అవగాహన పెంపొందించేందుకు ప్రభుత్వం చేపడుతున్న యోగాంధ్ర-2026 కార్యక్రమాలను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.యోగాభ్యాసం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని, యువతతో పాటు అన్ని వయసుల వారు యోగాను అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# జగనన్న ముఖ్యమంత్రి అయ్యేందుకు రధసారదులు మీరే

## వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి

## ఎన్నికల్లో గెలిచేందుకు సైనికులుగా పనిచేయండి.. పరిశీలకులు పిడతల



**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జూన్ 8**

2029లో ప్రతిష్టత్మమాకంగా జరిగే జరిగే ఎన్నికల్లో జగన్నన్ననుముఖ్యమంత్రిని చేసే గొప్ప కార్య లక్ష్యంలో బియల్ఏ లే రధసారదులని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం నియోజకవర్గం లోనిఐదు మండలాల బూత్ లెవెల్ ఏజెంట్లతో యస్ ఐ ఆర్ ప్రక్రియపై అవగాహనా సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన యస్ ఐ ఆర్ ప్రక్రియ వారికి కల్పవృక్షమని అది పెద్ద విపత్తు అని మనం మేలుకొని జాగ్రత్త పడకుంటే మన వజ్రయుధం లాంటి ఓటు హక్కుకే పెద్ద ప్రమాదమని అన్నారు. యస్ ఐ ఆర్ పద్దతితో యస్సి యస్టీ మైనార్టీల ఓట్లు తప్పుడు లెక్కలతో గల్లంతు చేసే ప్రమాదం ఉందని అన్నారు. దాదాపు ఇరవై శాతం పైనున్న యస్సిల ఓట్లు వద్దంటు బిసి లలో చేర్చాలని కుట్ర రచన చేస్తున్నారని, స్వయంగా స్పీకర్ యస్సిల ఓట్లను తొలగించాలని చెప్పడం సిగ్గు చేటని అన్నారు.మతం మారితే కులం మారుతుందా యస్సిని బి సి చేయాలని చూడటం అవివేకమని కుట్ర రాజకీయాలను త్రిప్పి కొట్టాలని అన్నారు. వైస్సార్సీపీ బియల్ఏ లు బి యల్ ఓ లతో కలిసి వెళ్లాలని, వైస్సార్సీపీకి ఓట్లు వేసే వారి ఓట్లను అందరి ఓట్లు ఉండేలా బి యల్ ఏ లు జాగ్రత్తలు వహించాలని అన్నారు. నియోజకవర్గపరిశీలకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతు రాష్ట్రంలో వైస్సార్సీపీ సోషల్ మీడియా, బూత్ లెవెల్ ఏజెంట్లు బలమైన శక్తిగా వున్నారని, జగనన్న మళ్ళీ ముఖ్యమంత్రి కావాలనే లక్ష్యంతో మరింత శ్రమించాలని అన్నారు. బి యల్ ఏ ల రాష్ట్ర కార్యదర్శి రమణ రెడ్డి మాట్లాడుతు యస్ ఐ ఆర్ ప్రక్రియ బూత్ స్థాయి నిర్వహణ, పార్టీ నిర్మాణబలోపేతం అనుసరించాలిసిన కార్యాచరణ పై దిశ నిర్దేశం చేసారు. ఈ కార్యక్రమంలో వైస్సార్సీపీ జిల్లా సహాయ కార్యదర్శి ఒంగోలు మూర్తిరెడ్డి,మండల కన్వీనర్లు ఏకుల ముసలారెడ్డి, గంట వెంకట రమణ రెడ్డి, కృష్ణ రెడ్డి, దోమకాల వెంకటేశ్వర్లు, పట్టణ అధ్యక్షులు కందూరి కాశీవిశ్వనాద్,కొప్పర్తి ఓబుల్ రెడ్డి, ఒంగోలు సుబ్బారెడ్డి, కందూరి గురు ప్రసాద్, షేక్ వలి, నాయకులు, పాల్గొన్నారు.




# ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత

## జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు




**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జూన్ 8**

ప్రజలకు పోలీసు సేవలను మరింత చేరువ చేయడం, వారి సమస్యలను సత్వరంగా పరిష్కరించాలనే లక్ష్యంతో పోలీసు యంత్రాంగం మీ కోసం కార్యక్రమం నిర్వహిస్తుందని మార్కాపురం జిల్లా ఇన్చార్జి ఎస్పీ, వి హర్షవర్ధన్ రాజు అన్నారు. సోమవారం యర్రగొండపాలెం పోలీసు స్టేషన్ లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా యర్రగొండపాలెం ఇతర ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదిదారుల వ్రాతపూర్వక వినతులను జిల్లా ఎస్పీ, పోలీస్ అధికారులు స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని, వాటిని చట్టపరిధిలో పరిష్కరిస్తామని భరోసా కల్పించారు. అందిన ఫిర్యాదులకు సంబంధించి ఫిర్యాదుదారుల వివరాలను ఆయా పోలీస్ స్టేషన్ అధికారులకు తెలియజేసి, తక్షణమే విచారణ చేపట్టి, చట్ట ప్రకారం తగిన చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని జిల్లా ఎస్పీ ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, అందిన ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి సత్వర పరిష్కారం చూపేలా సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు.ఈకార్యక్రమం ద్వారా యర్రగొండపాలెం ఇతర ప్రాంతాల నుండి 36 ఫిర్యాదులు అందినట్లు తెలిపారు. ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు పోలీసు వ్యవస్థను ప్రజలకు మమేకం చేయడంలో భాగంగా ఈ ప్రత్యేక మీ కోసం కార్యక్రమం నిర్వహించడం జరిగిందని, యర్రగొండపాలెం పట్టణం మరియు పరిసర ప్రాంతాల ప్రజలు ముఖ్యంగా మహిళలు, వృద్ధులు వారి సమస్యల పరిష్కారం కోసం దూర ప్రాంతాల నుండి వ్యయప్రయాసలు పడి మార్కాపురంలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయానికి రాకుండా ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకున్నారని అన్నారు. ప్రజాఫిర్యాదులకు అధిక ప్రాధాన్యతనిచ్చి పూర్తి స్థాయి విచారణ జరిపి సత్వర న్యాయం అందించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.ఈ ప్రత్యేక మీకోసం కార్యక్రమంలో ఎక్కువగా కుటుంబ కలహాలు, భర్త,అత్తారింటి వేదింపులు, భూ ఆస్థి వివాదాలు మరియు ఇతర సమస్యలపై పిర్యాదులు అందాయి.ఈ కార్యక్రమంలో మార్కాపురం డిఎస్పీ యు.నాగరాజు, ఎస్బి ఇన్స్పెక్టర్ శ్రీనివాసరావు,డిసిఆర్బీ ఇన్స్పెక్టర్ దేవప్రభాకర్, త్రిపురాంతకం సీఐ అస్లాం,పొదిలి సీఐ రాజేష్ కుమార్, మార్కాపురం సీఐ అల్తాఫ్ హుసేన్, యర్రగొండపాలెం ఎస్సై దేవకుమార్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# వీఆర్వో ఆత్మహత్య కు కారకులైన అధికారుల పై చర్యలు తీసుకోవాలి

## గిద్దలూరు వీఆర్వో ల సంఘం ఆధ్వర్యంలో నిరసన



**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 8**

కర్నూల్ జిల్లాలో పని వత్తిడి వల్ల ఆత్మహత్య చేసుకున్న గ్రామ రెవెన్యూ అధికారి మహమ్మద్ హుస్సేన్ మృతికి కారణమైన వారి మీద తగు చర్యలు తీరసుకోవాలని గ్రామ రెవిన్యూ అధికారుల సంఘం మార్కాపురం జిల్లా అధ్యక్షులు ్రా రంగయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు ్రా రంగయ్య అధ్యర్యంలో సోమవారం గిద్దలూరు తహశీల్దార్ కార్యాలయం లో వి ఆర్వో మహమ్మద్ హుస్సేన్ కుటుంబానికి న్యాయం జరగాలని నిరసన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం లో ఆయన మాట్లాడుతూ మన సహ ఉద్యోగి అయిన మహమ్మద్ హుస్సేన్ కుటుంబానికి ఆర్థికంగా రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉండాలని, మహమ్మద్ హుస్సేన్ చావుకు కారణమైన అధికారులపై చర్యలు తీసుకోవాలని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా రాష్ట్ర ప్రభుత్వం అలాగే జిల్లాలోని జిల్లా కలెక్టర్లు చర్యలు తీసుకోవాలని. గ్రామ రెవెన్యూ అధికారులు గ్రామ సర్వేయర్లు గ్రామ రెవెన్యూ సహాయకుల పై ఉన్న పని ఒత్తిడిని తగ్గించాలని సింగిల్ లైన్ మానిటరింగ్ సిస్టం ను ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అరిగెల. వెంకట రామయ్య, గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ.అజయ్ కుమార్, గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం నాయకులు బిజ్జం.రాజశేఖర్ రెడ్డి, డి.అచ్చయ్య, పప్పుల కొండయ్య, ఆంజనెయలు, ఖాసీంపీరా, వెంకటేశ్వర్లు, ఖాసీంవలి,సిద్దయ్య గ్రామ సర్వేయర్ లు దూదేకుల. ఖాజావాలి, రమేష్ రెడ్డి, శివప్రసాద్ రెడ్డి, ప్రవల్లిక, శ్రీకాంత్, వెంకట్రావు, విలేజ్ రెవెన్యూ అసిస్టెంట్ల రాష్ట్ర కార్యదర్శి ఉరఫ్.అంజి నాయకులు అల్లురయ్య తదితరులు పాల్గొన్నారు.

# కూటమి ప్రభుత్వ వైఫల్యాలను నిరసిస్తూ జరిగిన సెమినార్

-జగన్ అంటే ఎక్కువ పథకాలు ఇస్తామని ప్రజలకు వెన్నుపోటు

-రోడ్డుకు ఇరువైపులా నాలుగు అంగుళాలు వెడల్పు చేసి మధ్యలో డివైడర్ వేసి అభివృద్ధి అంటే ఎలా

-మాజీ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్





**కందుకూరు పెన్ పవర్, జూన్ 8**

రాష్ట్రంలో అబద్ధాలా హామీలతో అధికారంలో కొచ్చిన చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని నియోజకవర్గ ఇన్చార్జి బుర్రా మధుసూదన్ యాదవ్ తీవ్రంగా ధ్వజమెత్తారు. స్థానిక పామూరు రోడ్ లోని ఎస్ వి ఎస్ కళ్యాణ మండపం లో జరిగిన నియోజకవర్గ స్థాయి సెమినార్లో పార్టీ శ్రేణులను ఉద్దేశించి మాట్లాడుతూ ఎక్కడా అవినీతి జరగకుండా జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో సంక్షేమం అందించామని సంక్షేమమే అజెండాగా డిబిటి, నాన్ డిబిటి ద్వారా లబ్ధిదారుల ఖాతాలోకి నేరుగా నాలుగు లక్షల 58 వేల 361 కోట్ల రూపాయల జమ చేయడం జరిగిందని అన్నారు. జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన సంక్షేమ పథకాల డబ్బులన్నీ కూటమి ప్రభుత్వంలో ఎటుపోతున్నాయని ప్రశ్నించారు. దోచుకో దాచుకో పంచుకో పథకం ద్వారా బాబు ఇచ్చిన షూరిటీ మోసం గ్యారెంటీగా మారిందని విమర్శించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ సెంట్రల్ కమిటీ పిలుపు మేరకు గడచిన రెండేళ్ల తెలుగుదేశం నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయక పోగా ప్రజలను నమ్మించి వెన్నుపోటు పొడిచిన కూటమి ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ మాట్లాడటం జరిగినది. సెమినార్ లో మాట్లాడుతూ యువత,మహిళలు, రైతుల తోపాటు అన్ని వర్గాలను కూటమి ప్రభుత్వం మోసం చేసి ముంచిన విధానాన్ని ప్రజలకు స్పష్టంగా అవగతం చేసుకుంటున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వ వలన ఇబ్బందులు పాలైన అన్ని వర్గాల ప్రజలు నిలదీయటానికి సిద్ధంగా ఉన్నారని అన్నారు . ముఖ్యంగా నిరుద్యోగ భృతిని అమలు చేయకుండా యువతను మోసం చేసింది. కూటమి ప్రభుత్వం చేతకాని విధానాల వలన డిఎస్సీ ని అవకతవకలతో నిర్వహించి అర్హులైన వారికి కూడా ఉద్యోగం దొరకకుండా మోసం చేసింది,ఆడబిడ్డలకు 1500 నెలనెలా ఇస్తానని అబద్ధాలు చెప్పి, అమ్మ ఒడిని అందరికీ అమలు చేయకుండా నిట్ట నిలువునా మహిళలను దగా చేసిందని అన్నారు. అన్నదాతను మోసం చేసి రెండేళ్లుగాను ఇవ్వాల్సిన అన్నదాత సుఖీభవ పథకాన్ని అరకొరగా అమలు చేశారు. 50 ఏళ్లకే బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు పెన్షన్ ఇస్తానన్న పథకానికి పంగనామాలు పెట్టి ప్రతి నెల ఇవ్వాల్సిన పెన్షన్లు కోత పెట్టిన ఘనత చంద్రబాబు నాయుడు దేనిని అన్నారు. స్థానిక ఎమ్మెల్యే అయితే నేను అభివృద్ధి చేస్తున్నానని ప్రెస్ మీట్ లు పెట్టి సొంత డబ్బా కొట్టుకోవడం తప్ప పొడిచింది ఏమీ లేదని రోడ్లకు అటుపక్క ఇటుపక్క 4 అడుగులు వెడల్పు చేసి మధ్యలో డివైడర్లు వేసి వాటి మధ్యలో స్తంభాలను నిలబెట్టి వాటికి ఎమ్మెల్యే పార్టీ రంగులు లైటింగ్ వేసుకొని ఆ చివర ఈ చివర పెద్దపెద్ద హోర్డింగులు వేసుకొని అభివృద్ధి అంటే ఇదే అని గొప్పలు చెప్పుకుంటున్నారు తప్ప మరొకటి ఏమి లేదని అన్నారు. ఎమ్మెల్యేని సూటిగా ప్రశ్నిస్తున్న హోర్డింగులు వేసుకుంటానని చెప్పి ఓట్లు అడిగావా లేక సూపర్ సిక్స్ హామీలు పథకాలు అమలు చేస్తానని ఓట్లు అడిగావా చెప్పాలని సూటిగా ప్రశ్నించారు. జగనన్న ఇస్తానన్న పథకాలే కాకుండా మరిన్ని ఇస్తామని ప్రజలను నమ్మ పలికి ఇప్పుడు వాటిని గాలికి వదిలేయటం మీ కోటమి ప్రభుత్వానికి చెల్లుబాటు అయిందని అన్నారు. అభివృద్ధి అంటే ఇదేనా అవును అభివృద్ధి అంటే ఇదే అనే విషయం చెప్పే సాహసం నువ్వు చేయగలవా అని అన్నారు. ఈ కార్యక్రమంలో తోకల కొండయ్య, చీమల వెంకటరాజా అప్పనబోయిన రాజేష్, గణేశం గంగిరెడ్డి ముప్పవరపు కిషోర్, షేక్ రఫీ, అనుమోలు లక్ష్మీనరసింహం, ఈదర రమేష్,నన్నం పోతురాజు, యడ్ల మాధవరెడ్డి, నోటి వెంకటేశ్వర్ రెడ్డి, బిల్లా రమణయ్య, బద్దిపూడి జయరావు, రావుల కొల్లు బ్రహ్మానందం, ఉచ్చులూరు రవీంద్ర, వల్లూరి కోటేశ్వరరావు, నల్లమోతు చంద్రమౌళి, పెన్నా కృష్ణయ్య, పులి రమేషు, కట్టా హనుమంతరావు, గేరా మనోహర్, ఇరపని అంజయ్య, పల్నాటి చెన్నయ్య, షేక్ రహీమ్, గుత్తా గోపి, దేవిశెట్టి రాజేష్ ,బిల్లా రమణయ్య,కాపులూరి మధుసూదన్, పాటి రమేష్, తదితరులు పాల్గొన్నారు. ముందుగా దివంగత మహానేత వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం రెండేళ్ల ధగా పరిపాలన గురించి ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్లో ప్రారంభించి తిలకించడం జరిగినది. వెన్నుపోటుకు రెండేళ్లు కు నిరసనగా నల్ల బెలూన్లును ఎగురవేసి కూటమి ప్రభుత్వ విధానాలు నశించాలనే నినాదాలు చేశారు.

## జ్ఞాన ప్రకాశ్ శిక్షణా కార్యక్రమాన్ని పరిశీలించిన స్టేట్ రిసోర్స్ పర్సన్స్



**కందుకూరు పెన్ పవర్, జూన్ 8**

నియోజకవర్గ స్థాయిలో నిర్వహిస్తున్న జ్ఞాన ప్రకాశ్ 3.0 ఎఫ్ఎల్ఎన్ ఉపాధ్యాయుల శిక్షణా కార్యక్రమాన్ని స్టేట్ రిసోర్స్ పర్సన్స్ అర్రిబోయిన రాంబాబు, అంబటి బ్రహ్మయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా వారు శిక్షణా తరగతులను సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలు అందజేశారు. విద్యార్థుల అభ్యాసాన్ని మరింత ఆసక్తికరంగా తీర్చిదిద్దేందుకు పాఠశాలల్లో టీఎల్ఎం కార్నర్, డ్రాయింగ్ కార్నర్, బుక్స్ కార్నర్ వంటి అభ్యాస వనరులను ఏర్పాటు చేయాలని సూచించారు. తరగతి గదులను ఆకర్షణీయంగా తీర్చిదిద్ది విద్యార్థుల్లో నేర్చుకోవాలనే ఆసక్తిని పెంపొందించాలని తెలిపారు. అలాగే కరికులం గోల్స్ ఆధారంగా నిర్దేశించిన అభ్యాస లక్ష్యాలను సాధించేలా బోధన కొనసాగించాలని, పాఠ్యపుస్తకాన్ని ప్రధాన బోధన వనరుగా ఉపయోగిస్తూ విద్యార్థి కేంద్రిత బోధన చేపట్టాలని పేర్కొన్నారు. ఆటలు, పాటలు, కార్యకలాపాల ద్వారా జాయ్‌ఫుల్ లెర్నింగ్ వాతావరణాన్ని కల్పించి ప్రతి విద్యార్థి చురుకుగా పాల్గొనేలా చూడాలని సూచించారు. విద్యా క్యాలెండర్‌ను అనుసరించి నిర్దేశిత సమయానికి అన్ని అంశాలను బోధించాలని, ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ లక్ష్యాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. శిక్షణా కేంద్రంలో కల్పించిన వసతులను పరిశీలించిన వారు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కోర్స్ ఇన్‌చార్జి, ఎంఈఓ-1 ఎం.ఎస్.కే. శర్మ, కోర్స్ డైరెక్టర్ కె. సుబ్బారెడ్డి, డీఆర్‌పీలు పాల్గొన్నారు.

## నారాయణస్వామి ఆదివారం ఆదాయం రూ. 3,22,493/- లు



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 8**

జిల్లాలో ప్రసిద్ధిగాంచిన ప్రముఖ పుణ్యక్షేత్రమైన మిట్టపాలెం నారాయణస్వామి దేవస్థానం ఆదివారం ఆదాయం రూ.3,22,493/- లు వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిక్కెట్లు అమ్మకం ద్వారా జమ రూ. 1,00,980/- లు, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా రూ.37,540/- లు, శాశ్వత అన్నదాన పథకం నకు ద్వారా రూ,1,13,029/- లు , స్వామివారి పంచామృత అభిషేకమునకు రూ .50,828/- లు, మహా ప్రాకార నిర్మాణమునకు రూ.20,116/- లు వచ్చినట్లు తెలిపారు.

## యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

ఎంపీడీవో వి ప్రతాప రెడ్డి




**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 8**

ప్రతిరోజు యోగా ఉదయాన్నే సాధన చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం , ఏకగ్రత, మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి అన్నారు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు సోమవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ సమావేశ హాల్ నందు యోగా గురువులు ఆధ్వర్యంలో మాస్టర్ ట్రైనర్లు లకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వి ప్రతాపరెడ్డి మరియు వివిధ శాఖల మండలం అధికారులు యోగా తరగతులలో పాల్గొని పలు రకాల ఆసనాలను వేశారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ శిక్షణా కార్యక్రమం ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు ఈ కార్యక్రమంలో ఎంఈఓ రాజాల కొండారెడ్డి, డిప్యూటీ ఎంపీడీవో బ్రహ్మానందరెడ్డి, ప్రభుత్వ ఆయుర్వేద డాక్టర్ పుండరీ కాంక్షారావు, ఏపీవో సుబ్బారావు, ఉపాధి హామీ సిబ్బంది, స్వర్ణ గ్రామ సిబ్బంది, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# టిఆర్ఆర్ డిగ్రీ కళాశాల అడ్మిషన్ల దరఖాస్తులు ప్రారంభం

-ఈ విద్యా సంవత్సరం నుండి కళాశాలలో ఎన్ సిసి యూనిట్ పునరుద్ధరణ




**కందుకూరు పెన్ పవర్, జూన్ 8**

టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) కందుకూరు నందు 2026 -27 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థినీ విద్యార్థుల నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్, డాక్టర్ ఎం. రవి కుమార్ తెలియజేశారు. తమ కళాశాలలో బీఎస్సీ విభాగంలో మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ లలో మేజర్ కోర్సులు, జూవాలజీ, కంప్యూటర్ సైన్స్, డేటా సైన్స్ లలో మైనర్ కోర్సులు; బిఏ విభాగంలో ఎకనామిక్స్, పొలిటికల్ సైన్స్, స్పెషల్ ఇంగ్లీష్ మేజర్ కోర్సులు, హిస్టరీ , స్పెషల్ తెలుగులలో మైనర్ కోర్సులు;బీకాం విభాగంలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్స్ ఉపాధి ఆధారిత బి ఎఫ్ ఎస్ ఐ (బ్యాంకింగ్ ఫైనాన్స్ సెక్టార్ ఇన్సూరెన్స్) మేజర్ కోర్సులు ఉన్నాయని తెలియజేశారు. తమ కళాశాలలో నెట్, స్లెట్, పీహెచ్డీ చేసి పోటీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన, ఎంతో అనుభవం కలిగిన అధ్యాపకులతో అత్యున్నత విద్యాబోధన అందించబడుతుందని తెలిపారు. అత్యుత్తమమైన సైన్స్ ల్యాబ్స్, క్షేత్ర పరిశీలనకు అవకాశం ఉన్న 5 ఉద్యానవనాలు, ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా బోధన తమ కళాశాల ప్రత్యేకతలని ప్రిన్సిపాల్ ప్రకటించారు. 40 వేల పుస్తకాలతో, డిజిటల్ సౌకర్యాలు గల అధునాతన లైబ్రరీ, విశాలమైన క్రీడా మైదానం, విద్యార్థిని విద్యార్థులకు కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి, పోటీ పరీక్షలకు ఉన్నత విద్య ఎంట్రన్స్ పరీక్షలకు విద్యార్థులను తయారు చేయడం తమ కళాశాలలో నిరంతర ప్రక్రియలని ప్రిన్సిపాల్ తెలియజేశారు. న్యాక్ ఏ ప్లస్ గ్రేడింగు సాధించి, అటానమస్ ప్రభుత్వ కళాశాలగా గుర్తింపు పొంది, రెండు సంవత్సరాలు దిగ్విజయంగా పూర్తి చేసుకొని, అన్ని సబ్జెక్టులలో 90 శాతం పైగా ఉత్తీర్ణత సాధించి, మూడో సంవత్సరంలో అడుగిడుతున్నదని తెలిపారు. ఈ విద్యా సంవత్సరం నుండి కళాశాలలో ఎన్ సిసి యూనిట్ పునరుద్ధరణ జరిగే అవకాశాలు ఉన్నాయని ప్రిన్సిపాల్ తెలియజేశారు. కావున కందుకూరు పరిసర ప్రాంత విద్యార్థినీ విద్యార్థులు టి ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు అడ్మిషన్ పొంది తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని ఆయన తెలియజేశారు.

## ప్రపంచ యోగా దినోత్సవం కంభం చెరువు కట్టపై

**గిద్దలూరు పెన్ పవర్ జూన్ 8**



గిద్దలూరు నియోజకవర్గ ప్రజల ఆరోగ్యం, ఆనందం, ఆత్మవిశ్వాసం సమగ్ర శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని, ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని 2026 యోగాంధ్ర కార్యక్రమం ను అత్యంత వైభవంగా కంబం చెరువు కట్టపై నిర్వహించనున్నట్లు నిర్వహించనున్నట్లు తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో పేర్కొంది. యోగ ఫర్ వన్ ఎర్త్ -- వన్ హెల్త్" అనే మహోన్నత సందేశాన్ని ప్రజల హృదయాల్లో నింపే ఈ కార్యక్రమంలో, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, యువత, విద్యార్థులు, పెద్దలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పిలుపునిచ్చారు. కంభం చెరువుకట్టపై నిర్వహించనున్న ఈ యోగా కార్యక్రమం ద్వారా శరీరానికి ఆరోగ్యం, మనసుకు ప్రశాంతత, జీవితానికి శక్తి, సమాజానికి స్ఫూర్తి లభిస్తుందని పేర్కొన్నారు. యోగా అనేది కేవలం వ్యాయామం మాత్రమే కాదని, అది ఆరోగ్యవంతమైన, సానుకూలమైన, సమతుల్యమైన జీవితానికి మార్గదర్శకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా కలెక్టర్ ఎన్. విజయ సునీత ఆధ్వర్యంలో, గౌరవ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి సమక్షంలో నిర్వహించబడుతున్న ఈ మహత్తర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొని, యోగాను తమ దైనందిన జీవితంలో భాగంగా చేసుకోవాలని కోరారు. ఈకార్యక్రమం కంభం చెరువు కట్ట, కంభంలో మంగళవారం ఉదయం గం. 6.30 నుండి 8.00 గం " వరకు నిర్వహించేసునున్నట్లు తెలిపారు.

## ప్రత్యేక ఓటర్ల జాబితా సవరణపై నేడు కనిగిరిలో టీడీపీ సమావేశం

మండల టిడిపి అధ్యక్షులు బొబ్బూరి రమేష్



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 8**

ప్రత్యేక ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు కనిగిరిలోని అమరావతి గ్రౌండ్ లో కనిగిరి శాసనసభ్యులు ఒంగోలు పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి అధ్యక్షతన నేడు ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసినట్లు మండల టిడిపి అధ్యక్షుడు బొబ్బూరి రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 23 గ్రామ పంచాయతీల టిడిపి అధ్యక్షులు, క్లస్టర్ ఇన్చార్జీలు, యూనిట్ ఇన్చార్జీలు, బూత్ కమిటీ ఇన్చార్జీలు, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, అనుబంధ కమిటీల అధ్యక్షులు తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు.

## చంద్రమౌళీశ్వర స్వామి సన్నిధిలో బోయళ్ల విష్ణువర్ధన్ రెడ్డి

**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 8**

మండల కేంద్రమైన సి ఎస్ పురం లోని అతి పురాతన కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం లో ( శివాలయం) రాజగోపురం నిర్మాణదాత టిడిపి నాయకులు మాజీ సింగిల్ విండో చైర్మన్ బోయళ్ల నారాయణరెడ్డి కుమారుడు డాక్టర్ విష్ణువర్ధన్ రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ సందర్భంగా దేవస్థానం అర్చకులు గోత్రనామాలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు ఈ కార్యక్రమంలో కామాక్షి సమేత చంద్రమౌళీశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ నాయుడు నారాయణ, మాజీ ఉపసర్పంచ్ పాములపాటి నరసయ్య మాజీ నీటి సంఘం అధ్యక్షులు తోట వెంకటేశ్వర్లు జర్నలిస్టు సంగిశెట్టి పీరయ్య నాయుడు, సంగిశెట్టి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# చంద్రబాబు రెండేళ్ల పాలన లో అవినీతి అత్యాచారాలు అరాచకాలే

## వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి






**ఆర్ సి ఇంచార్జి యర్రగొండపాలెం పెన్ పవర్ జూన్ 8**
మాయల మరాఠి మాటలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు రెండేళ్ల పాలనలో అవినీతి అత్యాచారాలు అరాచకాలే తప్ప అభివృద్ధి లేదని వైస్సార్సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం చంద్రబాబు వెన్నుపోటుకు రెండేళ్లు అనే నినాదంతో అంబేద్కర్ ఆడిటోరియంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అధికార దాహంతో ఎన్నికల వేళ అమలు కానీ అబద్దపు హామీలు గుప్పించి,ఇచ్చిన హామీలను పూర్తిగా విస్మరించి, ప్రజల నమ్మకాన్ని వమ్ము చేసిన చంద్రబాబు నాయుడు రెండేళ్ల పాలనపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ సమావేశంలో యర్రగొండపాలెం శాసనసభ్యులు మరియు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి తాటిపర్తి చంద్రశేఖర్ , నియోజకవర్గ పరిశీలకులు పిడతల ప్రవీణ్ కుమార్ రెడ్డి గారు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతూ. ఈ రెండేళ్ల పాలనలో నిరుద్యోగులకు నిరుద్యోగ భృతి ఇస్తానని మోసం చేసాడని,రైతుల గుండెలపై ఎరువుల బరువును వేసాడని,మహిళలకు జరిగిన మేలు ఏమీ లేదని, ప్రజా సంక్షేమాన్ని పూర్తిగా గాలికొదిలేశారని విమర్శించారు.డి యస్సి పేరిట దగా డి యస్సి పెట్టి, పేకాట రాయుళ్లకు, అష్టచ్చమ్మ ఆడేవారికి, వంగుళ్ల దూకుల్లా, కర్ర బిళ్ళ ఆడే వారికీ అర్హత లేకున్నా ఉద్యోగాలు అమ్ముకున్న ఘనత సిగ్గు చేటని అన్నారు. చిన్నారులపై, మహిళలపై ప్రతిపూట అత్యాచారం, జరుగుతు మహిళ జాతికి రక్షణ లేకుండా పోయిందని అన్నారు. కూటమి దోస్త్ జనసేన నాయకుల కామ క్రీడలకుహద్దు లేకుండా పోయందని విమర్శించారు.వైఎస్సార్సీపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన ఉంటూ, ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాటాన్ని ఉధృతం చేస్తుందని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో యర్రగొండపాలెం నియోజకవర్గ వైసిపి ముఖ్య నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలుగుదేశం కార్యకర్త వివాహానికి హాజరైన ఎమ్మెల్యే తనయుడు విగ్నేష్



**పొదిలి, పెన్ పవర్, జూన్ 8**
మండలంలోని తుమ్మగుంట గ్రామానికి చెందిన కార్యకర్త వివాహానికి మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి తనయుడు, యువ నాయకుడు కందుల విగ్నేష్ హాజరయ్యారు. ఆ గ్రామానికి చెందిన తెలుగుదేశం కార్యకర్త టోనీ వివాహానికి సోమవారం నాడు విగ్నేష్ హాజరై, వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విగ్నేష్ తోపాటు మండల తెలుగుదేశం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# యోగాతో సంపూర్ణ ఆరోగ్యం






**పొన్నలూరు పెన్ పవర్ జూన్ 8**
క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం, ప్రశాంత జీవన శైలిని పొందవచ్చు అని ఎంపీడీవో పి సుజాత అన్నారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం యోగానంద కార్యక్రమం ఎంపీడీవో సుజాత ఆద్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగా చేయటం వల్ల రక్త ప్రసరణను మెరుగుపరుస్తుందని రక్తపోటును, కొలెస్ట్రాల్ స్థాయిలను అదుపులో ఉంచుతుందని యోగా వల్ల నాడీ వ్యవస్థ ప్రశాంతపడుతుందని తద్వారా ఒత్తిడి తగ్గి మనస్సు ప్రశాంతంగా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ వి పుల్లారావు, ఏపీవో సుధాకర్ రావు, ఏపిఎం శ్రీనివాసరావు, కోటేశ్వరరావు, ఎంఈఓ లు రవిచంద్ర, ట్రైని కోటేశ్వరరావు, భాగ్యవతి, పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు, ఎం.ఎల్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ లక్ష్మీ నృసింహుని సేవలో హైకోర్ట్ జడ్జ్ లు..

**సఖినేటిపల్లి, పెన్ పవర్ జూన్ 8**
డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం, అంతర్వేది గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ నరసింహస్వామి వారిని పాట్నా హైకోర్ట్ జస్టిస్ ఎ అభిషేక్ రెడ్డి, త్రిపుర హైకోర్ట్ జస్టిస్ ఎస్.రామచంద్ర రావు కుటుంబ సమేతముగా దర్శించుకొన్నారు. వారికి ఆలయ అర్చక స్వాములు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికి, శ్రీ స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించినారు. వేద పండితులచే వేదాశిర్వచనం అందించినారు. వారికి ప్రసాదం, చిత్రపటం ను ఆలయ అసిస్టెంట్ కమీషనర్ ఏం కే టి నాగవర ప్రసాదు అందించారు. ఈ కార్యక్రమములో రెవెన్యూ, పోలీస్, కోర్టు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# యోగా కేవలం వ్యాయమం కాదు సంపూర్ణ జీవన విధానం

## యోగాతో ఆరోగ్యం ఆత్మవికాసం సాధ్యం మాదినేని లక్ష్మణ్



**సి ఎస్ పురం, పెన్ పవర్ జూన్ 8**
భారతీయ సంస్కృతికి ప్రతీకగా నిలిచిన యోగా నేడు ప్రపంచవ్యాప్తంగా సంపూర్ణ ఆరోగ్యానికి మార్గదర్శకంగా గుర్తింపు పొందిందని బిజెపి రాష్ట్ర మాజీ ఓబీసీ మోర్చా కార్యవర్గ సభ్యులు మాదినేని లక్ష్మణ్ పేర్కొన్నారు. యోగా దినోత్సవం గురించి ఆయన మాట్లాడుతూ భారతదేశంలో కొన్ని వేల సంవత్సరాల క్రితం ఋషులు మానవాళి శ్రేయస్సు కోసం అందించిన యోగా విద్య నేడు ప్రపంచ దేశాలను ఆకర్షిస్తోందన్నారు.యోగ ద్వారా శరీరం, మనస్సు, ఆత్మ మధ్య సమతుల్యత ఏర్పడి జీవన నాణ్యత మెరుగుపడటంతో పాటు సంపూర్ణ వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని తెలిపారు. ఆధునిక జీవనశైలిలో పెరుగుతున్న ఒత్తిడి, ఆందోళనలను తగ్గించడంలో యోగా కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. యోగా సాధనతో శారీరక ఆరోగ్యం మెరుగుపడటమే కాకుండా మానసిక ప్రశాంతత, ఏకాగ్రత, జ్ఞాపకశక్తి పెరుగుతాయని వివరించారు.యోగ కేవలం శరీర వ్యాయామం మాత్రమే కాకుండా అంతరంగ వికాసానికి దారి చూపే జీవన విధానమని ఆయన పేర్కొన్నారు. భగవద్గీతలో శ్రీకృష్ణుడు యోగాన్ని “కర్మ కౌశలం”గా అభివర్ణించారని గుర్తుచేశారు. ధ్యానం ద్వారా ఆలోచనలను నియంత్రించుకోవడం అలవాటై విద్యార్థుల్లో ఏకాగ్రత, ప్రతిభ పెరిగి ఉత్తమ ఫలితాలు సాధించగలరని అన్నారు.ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, హింస, అసహనం పెరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో యోగా శాంతి, సామరస్యానికి మార్గం చూపే వెలుగు దీపంలా నిలుస్తోందని పేర్కొన్నారు. కుటుంబ శాంతి, సమాజ శాంతి, ప్రపంచ శాంతి సాధనలో యోగ కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చొరవతో ఐక్యరాజ్యసమితి 2014లో జూన్ 21 ను అంతర్జాతీయ యోగా దినోత్సవం గా ప్రకటించిందని, 177 దేశాల మద్దతుతో ఆమోద పొందడం భారతదేశానికి గర్వకారణమని అన్నారు 2015 జూన్ 21న తొలి అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని ప్రపంచవ్యాప్తంగా ఘనంగా నిర్వహించారని తెలిపారు అలాగే యోగా ప్రాచుర్యానికి గుర్తింపుగా రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2015 లో పది రూపాయల స్మారక నాణ్యాన్ని విడుదల చేసిందని గుర్తు చేశారు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో యోగా కార్యక్రమాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని యోగేంద్ర కార్యక్రమాన్ని 2026 లో జూన్ నెల 7 నుండి 20 వరకు శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి జూన్ 21న విజయవాడలో వేలాది మందితో భారీ యోగా కార్యక్రమాలు పట్టిందని అన్నారు ఈ సంవత్సరము కూడా అలాగే ప్రజలందరూ యోగాంధ్ర కార్యక్రమాల్లో పాల్గొని ఆరోగ్యవంతమైన జీవితాన్ని అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు.

# కుప్పం బాధ్యతల నుంచి తప్పుకున్న ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

**-అధినేత ఆదేశమే శిరోధార్యం -రాష్ట్రస్థాయి బాధ్యతలకు సిద్ధం**

**-సాధారణ కార్యకర్త నుంచి రాష్ట్ర నాయకత్వం వైపు -రాష్ట్ర స్థాయిలో కొత్త బాధ్యతల కోసం అధినేత ఆదేశాలు**

**- పార్టీ నిర్ణయాలకు కట్టుబడి ఉంటానన్న శ్రీకాంత్**



**కందుకూరు పెన్ పవర్, జూన్ 8**
తెలుగుదేశం పార్టీ తనకు అందించిన ప్రతి అవకాశాన్ని బాధ్యతగా స్వీకరించి పనిచేశానని, పార్టీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకే కుప్పం నియోజకవర్గ బాధ్యతల నుంచి తప్పుకున్నట్లు తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ వెల్లడించారు. ఈ మేరకు ఆయన విడుదల చేసిన భావోద్వేగ ప్రకటనలో తన రాజకీయ జీవితానికి పునాది వేసింది చంద్రబాబు నాయుడు అని పేర్కొన్నారు. కందుకూరు ప్రాంతానికి చెందిన ఒక సాధారణ కార్యకర్తగా ఉన్న తనను గుర్తించి 2008లో తెలుగు సాంకేతిక నిపుణుల విభాగం (టీఎన్ఎస్వీ) రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా అవకాశం కల్పించడం ద్వారా రాజకీయ జీవితానికి శ్రీకారం చుట్టించారని గుర్తు చేసుకున్నారు. అనంతరం 2014లో జడ్పీటీసీ అభ్యర్థిగా అవకాశం ఇచ్చి ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకువచ్చారని, తన రాజకీయ ప్రస్థానంలో ప్రతి అడుగు వెనుక చంద్రబాబు నాయుడు మార్గనిర్దేశం, ప్రోత్సాహం, ఆశీస్సులు ఉన్నాయని తెలిపారు.

**ఎమ్మెల్సీ విజయానికి అధినేత ప్రోత్సాహమే కారణం....**

2023 తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక తన రాజకీయ జీవితంలో కీలక ఘట్టమని శ్రీకాంత్ పేర్కొన్నారు. ఆ ఎన్నికలో తనపై చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లు అపారమైన విశ్వాసం ఉంచి అభ్యర్థిగా ఎంపిక చేశారని తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి క్షణం మార్గనిర్దేశం చేస్తూ విజయతీరాలకు చేర్చారని చెప్పారు.దాదాపు మూడు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ గెలవని స్థానాన్ని పార్టీ ఖాతాలో జమ చేయగలిగినప్పుడు, తన విజయాన్ని పార్టీ విజయంగా భావించి చంద్రబాబు నాయుడు అభినందించిన సందర్భం జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకమని పేర్కొన్నారు.

**కుప్పం బాధ్యతలు అత్యున్నత గౌరవం.....**

ఏడు సార్లు వరుస విజయాలు సాధించిన కుప్పం నియోజకవర్గ బాధ్యతలను తనలాంటి యువ నాయకుడిపై నమ్మకంతో అప్పగించడం జీవితంలో అత్యున్నత గౌరవంగా భావిస్తున్నానని శ్రీకాంత్ తెలిపారు. గత మూడు సంవత్సరాలుగా కుప్పంను సొంత కుటుంబంగా భావిస్తూ కార్యకర్తలు, నాయకులతో కలిసి పార్టీ బలోపేతానికి కృషి చేశానని పేర్కొన్నారు.2024 ఎన్నికలకు ముందు, ఎన్నికల అనంతరం కూడా పార్టీ అప్పగించిన బాధ్యతలను అత్యంత నిబద్ధతతో నిర్వహించానని చెప్పారు. పార్టీ కోసం, కార్యకర్తల కోసం, ప్రజల కోసం తన శక్తిమేరకు పనిచేసినట్లు వెల్లడించారు.

**రాష్ట్ర స్థాయి బాధ్యతల వైపు అడుగులు.....**

ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ అవసరాలు, భవిష్యత్ కార్యాచరణను దృష్టిలో ఉంచుకుని అధినేత చంద్రబాబు నాయుడు తనను రాష్ట్ర స్థాయిలో మరో కీలక బాధ్యత కోసం సిద్ధం చేస్తున్నారని శ్రీకాంత్ తెలిపారు. పార్టీ శ్రేయస్సే ఎల్లప్పుడూ ప్రథమ ప్రాధాన్యమని, ఏ బాధ్యత అప్పగించినా పూర్తి అంకితభావంతో నిర్వర్తించేందుకు సిద్ధంగా ఉన్నానని స్పష్టం చేశారు. చంద్రబాబు నాయుడు తీసుకునే ప్రతి నిర్ణయం పార్టీ ప్రయోజనాలు, కార్యకర్తల భవిష్యత్తు, రాష్ట్ర అభివృద్ధిని దృష్టిలో ఉంచుకునే ఉంటుందని తనకు సంపూర్ణ విశ్వాసమని పేర్కొన్నారు. అధినేత ఆదేశాలు తనకు శిరోధార్యమని, పార్టీ నిర్ణయాలకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటానని స్పష్టం చేశారు.

**కార్యకర్తలకు కృతజ్ఞతలు.....**

గత మూడు సంవత్సరాలుగా కుప్పం నియోజకవర్గంలో తనకు అండగా నిలిచిన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. వారి ప్రేమ, సహకారం, ఆశీర్వాదాలు భవిష్యత్తులో కూడా తనకు కొనసాగాలని ఆకాంక్షించారు. తెలుగుదేశం పార్టీ బలోపేతం కోసం, చంద్రబాబు నాయుడు ఆశయాల సాధన కోసం, నారా లోకేష్ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు భవిష్యత్తులోనూ అంకితభావంతో పనిచేస్తానని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ స్పష్టం చేశారు.

# ఒక మొక్క నాటండి.. పర్యావరణాన్ని కాపాడండి

## బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డా. ఏలూరి



**మార్కాపురం పెన్ పవర్ జూన్ 8**
ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు ప్రతి ఒక్కరూ తమ అమ్మ పేరుతో కనీసం ఒక మొక్కను నాటి, పర్యావరణాన్ని కాపాడాలని బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి డాక్టర్ ఏలూరి రామచంద్రారెడ్డి కోరారు. ప్రకృతిని కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యత అని, పర్యావరణ పరిరక్షణ కోసం సామాజిక ఉద్యమంగా మొక్కల పెంపకాన్ని చేపట్టాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. అలాగే ఒక మొక్కను నాటడం అంటే కేవలం ఒక చెట్టును పెంచడం కాదు, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన జీవన వాతావరణాన్ని అందించడం అని అన్నారు. మన తల్లి మనకు జన్మనిచ్చి జీవితాన్ని ప్రసాదించినట్లే, చెట్లు కూడా మనకు ప్రాణవాయువును అందించి జీవనాన్ని కొనసాగిస్తాయని పేర్కొన్నారు. అందుకే అమ్మ ప్రేమకు, త్యాగానికి గుర్తుగా ఆమె పేరుతో ఒక మొక్కను నాటడం అత్యంత గొప్ప సేవ అని చెప్పారు. కాగా నానాటికీ చెట్ల సంఖ్య తగ్గిపోతుండటంతో పర్యావరణ సమతుల్యత దెబ్బతింటోందని, దాని ప్రభావం వాతావరణ మార్పుల రూపంలో స్పష్టంగా కనిపిస్తోందని పేర్కొన్నారు.

